# రేపటి యువతి

శివం



“హల్లో” అన్నది సునంద, టెలిఫోన్ రిసీవర్ని గట్టిగా చెవికి అదుముకుంటూ. ‘‘హల్లో! మధుబాబు స్పీకింగ్.” అన్నది అవతలనుంచి స్వరం – చాలా హడావుడిగా, కర్కశంగా, అయిష్టంగా.

సునంద, మధుబాబు పేరు వినగానే వుత్సాహంతో వుక్కిరి బిక్కిరి అయినా అతని కర్కశ స్వరానికి, హడావుడికి ఒక్కక్షణం నిరాశలో తేలి, అంతలో పుంజుకొని, ‘‘హల్లో మధుబాబుగారూ! నన్ను గుర్తుపట్టలేదూ? నేను సునందని. మనం బొంబాయిలో వోసారి, ఆర్నెల్లక్రితం – కల్సుకున్నాం,” అన్నది వుత్సాహంతో.

గత మూడు నెలలనుంచీ మధుబాబుని కల్సుకుందామని ఆమె ప్రయత్నం. ఒక్కసారి కనక అతనిని కల్సుకుని గనక మాట్లాడితే, తన మనస్సుకి శాంతి అనేది వుండటమో వుండకపోడమో తేలిపోతుంది. ఈ వుద్దేశంతోనే సునంద బొంబాయినుంచి హైద్రాబాద్ పనికట్టుకుని వచ్చింది కూడాను.

మధుబాబు స్వరం ఆకస్మికంగా మారిపోయింది. అతని స్వరంలో ఆప్యాయత తొణికిసలాడుతోంది.

“హాయ్! సునందా! ఎప్పుడూ రావడం?” అన్నాడు.

సునంద మొహంలో ఆనందం వెల్లివిరిసింది. మధుబాబు తనని మరచిపోలేదన్నమాట. తనెవ్వరో అతనికి గుర్తుచెయ్యడానికి ఎంత అవస్థపడాలో అనుకుంది! ఆర్నెల్లక్రితం తను, అతనితో యింతాచేసి రెండుగంటలు బీచ్లో మాట్లాడింది. (అఫ్కోర్సు, అంతకుముందురోజు టెన్నిస్ ఫైనల్సులో అద్భుతంగా ఆడి గెలవడం చూసింది) ఇద్దరూ ‘చెనా’ కొనుక్కుని తిన్నారు. సముద్రపు కెరటాల అంచునే పరుగులు తీసేరు– కెరటాల్ని కవ్విస్తూ! చిన్నపిల్లల్లా ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. ఆఖరున అతను తన ఎడ్రెస్

తీసుకున్నాడు. అతని ఎడ్రెస్సు తనకి ఇచ్చేడు. తర్వాత ప్రతి రోజూ అతని ఉత్తరంకోసం ఎదురుచూసి, విసుగెత్తి పోయింది.

"ఇప్పుడే - ఇవ్వేళనే వచ్చేను." అన్నది సునంద ఆలోచనల్లోంచి యివతలపడి.

"ఎక్కడ వున్నావ్? బంధువులు ఎవరైనా వున్నారా?"

"ఊహు... మైసూర్ లాడ్జ్‌లో, రూం నంబర్ 16. ఇట్లాపనికట్టుకుని మిమ్మల్ని పిలవడం..." మాటలు తేల్చేసింది సునంద.

"నీ విషయంలో మాత్రం అందంగా ముచ్చటగా వుంది," అనేసేడు అతను.

తనెందుకు యింతదూరం వచ్చిందీ తెలియక ఏమేమో మాట్లాడుతున్నాడు. తెలిస్తే యింకోమాదిరిగా మాట్లాడి వుండే వాడేమో. "నేనెందుకు పిలుస్తున్నానో తెలిస్తే అందంగా లేదంటారని భయం" అన్నది సునంద.

"అయితే చెప్పు...వింటాను." ఈసారి అతని స్వరంలో ఆప్యాయత తగ్గి, జాగర్త విన్పించింది.

తను నిర్మోహమాటంగా మాట్లాడాలని మొదటనే ఎంతో గట్టిగా నిర్ణయించుకున్నా, యిప్పుడు సునంద కాస్త తడబడింది. మాటలకోసం ఒక్క క్షణం తడుముకుని, అన్నది.

"ఇప్పుడు చెప్పలేను. కాని. మీరు ఆశ్చర్యపడకండా వుండాలని ఓ ఉత్తరం రాద్దామనుకున్నాను - ముందే! అదీ జరగలేదు. పోనీ ట్రంక్‌కాల్ చేద్దామనుకున్నాను బయలుదేరబోయేముందు. అదీ జరగలేదు. మనం ఓసారి కల్సుకుంటే అన్నీ వివరంగా మాట్లాడుకోవచ్చు. ఇట్లా ఫోన్‌లో చెప్పడం బావుండదు," అన్నది సునంద.

"ఓ! ఆట్లాగా! పోనీ భోజనం ముందు చెబుతావా?" అన్నాడు మధుబాబు.



"ఆ! చెప్పగలను."

"అయితే ఏడింటికి మీ హోటల్ లాబీ దగ్గరికి వస్తాను," అనేసి ఫోన్ పెట్టేసేడు.

సునంద పెద్ద నిట్టూర్పుతో ఫోన్‌ని క్రేడిల్‌మీద పెట్టేసి, కుర్చీలోకూర్చుంది. "అమ్మయ్య" అనుకుంది. తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది...

ఈ ప్రయాణమే చిత్రమైంది ... కాని చాలా ముఖ్యమైనది కూడాను. తన తల్లికూడా ఆమాటే చెప్పి త్వరగా వెళ్ళి 'ఏదోతేల్చుకురా' అన్నది అయిష్టంగానే. ఓ పక్కన తన మాటకోసం, తన తలితండ్రులు ఏరికోరిన వరుడు-లక్షాధికారి కొడుకు - భగీరధరావు ఎదురుచూస్తూ వుంటాడు. మరోప్రక్కన తను మధుబాబుని మరచిపోలేకుండా వున్నది.

మధుబాబు ఎంతగొప్ప టెన్నిస్ ఆటగాడైనా, తనకి టెన్నిస్ అంటే ఎంత పిచ్చి వున్నా, ఒక్కరోజులో, ఒక వ్యక్తిని యింత గాఢంగా ప్రేమించడం అసంభవం అని సునంద ఉద్దేశం. మధుబాబు అందగాడవచ్చును. ఆటగాడవచ్చును. మాటకారి అవచ్చును. కాని వీటన్నిటినీమించిన అవలక్షణాలు ఎన్నో వుండవచ్చును. ఒక్కరోజు - రెండు గంటల పరిచయంలో వాటిని తను కనుక్కోలేకపోవచ్చును. కాని అతనిని మరచిపోదామని ఎంత ప్రయత్నించినా సునంద అతనిని మరచిపోలేకపోతోంది. మధుబాబుకంటే, భగీరధరావు అన్ని విధాల గొప్పవాడు, అందగాడు, మంచివాడు అని తనకితాను నచ్చచెప్పకోలేకపోతోంది. పైగా, భగీరధరావు సంబంధం తన తలిదండ్రులు కోరే సంబంధం!

ఎందుకు? కాస్సేపట్లో అంతా తేలిపోతుంది అనుకుంది సునంద. ఎదురుగా వున్న అద్దంలో తనని తాను చూసుకుని నవ్వుకుంటూ.

సరిగ్గా ఏడుగంటలకల్లా మైసూర్ లాడ్జ్ హోటల్ లాబీలోకి ప్రవేశించేడు మధుబాబు. ప్రవేశిస్తున్న మధుబాబుని చూసిన సునంద తన కళ్ళను తనే నమ్మలేకపోయింది. తన మనస్సులో ముద్ర వెయ్యబడిన మధుబాబు కంటె యీ మధుబాబు చాలా అందం!

మధుబాబు చిరునవ్వుతో అక్కడ కూర్చున్నజనాన్ని పరిశీలించి, సునందని చూసి ముందుకి వచ్చేడు. సునంద లేచి నిలబడి, "గుర్తుపట్టేరన్నమాట!" అంది చిర్నవ్వుతో - వురకలు వేస్తున్న ఆనందాన్ని అణచుకుంటూ.

"మిమ్మల్ని - లక్షమందిలో వున్నా గుర్తుపట్టగలను! అంత త్వరగా ఎట్లా మరచిపోతాను ఆ మధుర క్షణాలు!" అన్నాడు మధుబాబు.

"కూర్చోండి." అంది సునంద ప్రక్కనే వున్న ఖాళీకుర్చీ చూపిస్తూ.

"ఇక్కడ గొప్పగా గాలి వేస్తోంది .. యిటువైపు కూర్చోండి ప్లీజ్," అన్నది.

మధుబాబు ప్రక్కనే వున్న ఖాళీ కుర్చీలో కూర్చుని, సిగరెట్ ఒకటి వెల్గించేడు.

'భగీరధరావుకి ఒక్క చెడ్డఅలవాటు కూడాలేదుఅనుకుంది' లోలోన సునంద.

సునంద వణికే చేతుల్ని, కుర్చీమీద ఆన్చి, గొంతుకూడా వణుకుతుందేమో నన్న భయంతో, నెమ్మదిగా అన్నది" ఫోన్‌లో చెప్పలేకపోయేను. బొంబాయి నుంచి మిమ్మల్ని చూడాలనే నేను వచ్చేను. నేను ఎంత ప్రయత్నించినా, మిమ్మల్ని నా మనస్సులోంచి తోసి వెయ్యలేకుండా వున్నాను."

"బాగానే వుంది! చెప్పండి... ఆగిపోయేరేం?" అన్నాడు అతను చిరునవ్వుతో.

సునంద క్షణం ఆగి అన్నది. "నేను పరిహాసం ఆడటంలేదు. నిజమేచెబ్తున్నా. మిమ్మల్ని మరచిపోడానికి ఎన్నివిధాల ప్రయత్నించాలో అన్నివిధాల ప్రయత్నించి, యింక లాభంలేక యిక్కడికి రావలసివచ్చింది. నాకు కావలసినంత డబ్బుంది. ప్రేమించడానికి స్నేహితులున్నారు - ముఖ్యంగా, భగీరధరావున్నాడు. అయినా మీరు గుర్తుకి వస్తూన్నారు. పోనీ కొన్నాళ్ళు ప్రయత్నిస్తే, మిమ్మల్ని మరచిపోవచ్చుననుకున్నాను. ఆర్నెల్లు అయినా మీరు నా మనస్సులోంచి వెళ్ళిపోకుండా కూర్చున్నారు. ఇంక నేనేం చేసేది చెప్పండి."

మధుబాబు పెదాలమీద చిందులు తొక్కే చిరునవ్వు అదృశ్యమయిపోయింది. కళ్ళల్లో ఏదో జాగర్త మెదిలింది. ఏ క్షణంలోనైనా కరుస్తుందేమోనన్నట్లు సునందని పరిశీలనగా ఓసారి చూసేడు. అతని మనస్సు, సునందపైన జాలితో నిండిపోయింది.

"ఇదంతా మీకు ఆశ్చర్యంగా కన్పించవచ్చు. కాని నా పరిస్థితి అర్థం చేసుకోండి. నేను భగీరధరావుతో మాట్లాడుతున్నా, మీరే గుర్తుకి వస్తున్నారంటే,... నేనేం చెప్పేది."

"భగీరధరావు ఎవ్వరు?" ప్రశ్నించేడు మధుబాబు.

"ఓ! అతనా? అతను చాలా మంచివాడండి. అందరికీ అతనంటే చాలా యిష్టం." అంటూ ఆగిపోయి, బద్ధకంగా నిట్టూర్చింది. భగీరధరావుని తమ కాలనీలో ఎరగని వాళ్ళెవ్వరు? ఎవరికి ఏ సాయం కావలసినా భగీరధరావే! ఆఖరికి, అతను రోడ్డుపైన వెళుతూంటే పిల్లలుకూడా 'అంకుల్' అంటూ అతని వెనకపడతారు. "చాలా త్వరలో యం.యల్. సి కూడా అవచ్చు." అన్నది.

"వండర్‌ఫుల్‌గా వుంది. మరి యింకా ఆలోచన ఎందుకు?" అన్నాడు మధుబాబు.

"వచ్చిన చిక్కల్లా, అతనితో మాట్లాడుతుంటే మీరే గుర్తొస్తారు.

ఒక్కోసారి అతన్ని చూస్తూంటే మీరే కన్పిస్తారు కూడాను. నాకు మతిభ్రమణం కూడా కల్గుతుందేమోనని భయమేస్తూ వుంటుంది. ఇట్లాంటి పరిస్థితిలో, అత నెంత మంచివాడైనా, గొప్పవాడైనా అతన్ని ఎట్లా పెళ్ళి చేసుకోవాలో మీరే చెప్పండి."


"ఇదీ మరీ బాగుందండోయి. దీనికి నన్నేం చెయ్యమంటారు? నేనేం చెప్ప గలను?" అన్నాడు ఖంగారుగా.

"అబ్బ! ఇందులో మీ తప్పువుందని నేను నిందవెయ్యడం లేదండి! ఇది నా భ్రమ అయి వుండొచ్చు. నేను నిజంగా మిమ్మల్ని ప్రేమిస్తూ వుండక పోవచ్చును." అంది త్వరితంగా, తల దించుకుని.

"ప్రేమించడమా? నన్నా! అబ్బే! అసలా అవకాశమే లేదు. మనం ఒకళ్ళ నొకళ్ళం సరిగ్గా నాలుగు గంటలుకూడా ఎరగం! అంతేకదూ? అన్నాడు మధుబాబు ఖంగారుపడుతూ.

"అవును. ఆ సంగతి నిర్ధారణ చేసుకోడానికే నేను అంతదూరంనుంచి యిట్లా వచ్చేసేను. మిమ్మల్ని నేనుబాగా ఎరగకపోవడం వల్లనే, ఏమేమో వూహించుకుని వుంటాను. మిమ్మల్ని బాగా తెలుసుకుంటే, మీలో నాకు కొన్ని అయిష్టమైన గుణాలు కన్పించవచ్చు. అప్పుడు నా భ్రమ తొలగిపోతుంది. నేను హాయిగా యింటికి వెళ్ళిపోతాను. దయచేసి మీపైన విరక్తి కలగడానికి నాకు కొంచెం వ్యవధి యివ్వండి. ఖర్చంటారా — ఎంతయితే అంతా నేనే భరిస్తాను. ప్లీజ్!" అంది సునంద ఆశగా మధుబాబు వైపు చూస్తూ.

"ఏమిటో నాకంతా గందరగోళంగా వుంది. నా బుర్ర తిరిగిపోతోంది. నాకేమీ అర్థంకావడంలేదు." అన్నాడు మధుబాబు, రెండు చేతులతో తన తలను పట్టుకొని.




"ఇందులో అర్థంకాకపోవడానికి పెద్ద జటిలమైన సమస్య ఏముందండి? మిమ్మల్ని నామనస్సులోనుంచి వదిలించు కోడానికి మీరునాకు 'హెల్ప్'చెయ్యాలి. అంతే! రండి భోజనంతో ప్రారంభిద్దాం."

మధుబాబు కళ్ళు ఆమె జుట్టుమీదకి చెంపలమీదకి, కళ్ళమీదకి ప్రయాణం చేసేయి. అతను చిరునవ్వుతో, "సరే, కానివ్వండి..." అన్నాడు. ఆమెకి వేపకాయంత వెర్రి వుండి తీరాలనే నిశ్చయంతో!

సునంద 'థాంక్సు' అంటూ తన వేనిటీ బ్యాగ్‌లోంచి ఒక వందరూపాయల కాగితం తీసి, 'చాలాఖర్చులు వుంటాయి. ఇది వుంచండి మీ దగ్గర," అన్నది.

మధుబాబు వందరూపాయల నోటును వెనక్కి తోసేసి, "చూడండి. నేను నిజం చెబుతున్నా. ప్రస్తుతం నాకు అర్జంటు పనులు ఏమీలేవు. నా దగ్గర డబ్బుంది మీ మాటల తీరు, అమాయ కత్వం, నాకు యిష్టంగానే వున్నాయి. మీలాంటి అందగత్తెతో కాస్సేపు వూళ్లో తిరగడం నాకేమీ నామోషీకాదు. పైగా మిమ్మల్ని... తెలుగులో ఏంచెప్పాలో తెలియడంలేదు — 'డిస్‌యిల్యూషన్ చెయ్యడం చాలా సరదాగా వుండేట్లుంది. నడవండి."

"ఓ... ఐయామ్ వెరీ గ్రేట్‌ఫుల్." అంటూ లేచింది సునంద.

"కాని ఓ సంగతి. నా జీవితం, నా పద్ధతులు మీకోసం మార్చుకోను. అదిమాత్రం అర్థంచేసుకోండి."అన్నాడు లేచినిలబడిన మధుబాబు నిక్కచ్చిగా.

"వద్దు. మార్చుకోవద్దు. నా పిచ్చి ఓ గంటలో వదిలిపోతుందని నానమ్మకం. నాకోసం కొంచెం కష్టపడండి. ఓర్పు చూపండి. ప్లీజ్."

"నా వుద్దేశం కూడా అంతే! భోజనం అయ్యేలోగా మనం దెబ్బలాడుకోకుండా వుంటామా అని." అన్నాడు మధుబాబు నవ్వుతో.

కాని మధుబాబు ఆశలు అడియాస లయ్యేయి. మధుబాబు హాయిగా అన్ని రకాల కూరలు, పచ్చళ్ళు కలుపుకొని తిని, రసం పోసుకుని, సాంబారు పోసుకుని, ఆఖరున పెరుగుఅన్నం కలుపుకొని, ఒక్క మెతుకుకూడా వదల కండా సుష్టుగా భోజనంచేసేడు. భోజనం చేస్తూన్నంతసేపూ హైదరాబాద్‌విశేషాలు చెబుతూనేవున్నాడు అతను.

సునందకు సుష్టుగా భోజనం చేసే వాళ్ళంటే ఎంతో యిష్టం.

భోజనం చేసేక సునంద అడిగింది, "మీ వుద్యోగం గురించి చెప్పండి. 'ఉద్యోగం గురించి మాట్లాడటం మొద

లెడితే అసలురంగు బయటపడిపోతుంది' అన్నాడు మా భాగీ''

"భాగీ ఎవ్వరు ?'' అన్నాడు ఆశ్చర్యంగా మధు.

"అదే మా భగీరథరావు,'' అంది సునంద నవ్వుతో.

"ఓ! మీరిక్కడకి వస్తున్నట్టు అతనికి కూడా తెలుసా?" అన్నాడు ఆశ్చర్యంగా సునందని చూస్తూ.

"ఎందుకు తెలియదు ? మీ సంగతి తేల్చుకున్నాకే అతనికి పెళ్ళి విషయం మాట యిస్తానన్నాను.

ఊ! మీ ఉద్యోగంసంగతి చెప్పండి." అంది అక్కడి లౌంజ్‌లోని సోఫాలో కూలబడి.

"నా వుద్యోగమా ? నా ఉద్యోగం అంటే నాకెంతో యిష్టం. దాన్ని గురించి మాట్లాడేనంటే మీరు బోరెత్తిపోతారు,"

"బోరెత్తాలనేగా అడిగేది చెప్పండి." అంది.

మధుకూడా సోఫాలో చేరబడి అరగంటసేపు బేంక్‌లోని తనవుద్యోగం, అందులోని సాధక బాధకాలు వల్లించేడు. అంతా విని సునంద చిరునవ్వు నవ్వింది. "వెరీ, ఇంటరెస్టింగ్ !" అంటూ.

''చూడండి. మనం యిట్లా హోటల్ లౌంజ్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటే మీకు 'బోర్' కాదూ. కొంచెందూరంలో పబ్లిక్ గార్డెన్ వుంది. అక్కడికి వెళ్దాం ... వస్తారా ?'' అన్నాడు మధుబాబు లేస్తూ.

''ష్యూర్ ! వెళ్దాం రండి.''

ఇద్దరూ ఆటోరిక్షాలో పబ్లిక్ గార్డెన్ దగ్గర దిగి, లోపలికి వెళ్ళేరు. సిమెంట్ బల్లపైన కూర్చోగానే సునంద అడిగింది, ''మీ బాల్యం గురించి చెప్పండి – వినాలని వుంది."

"నా బాల్యం గురించి ఏం చెప్పమంటారు ? అందరి పిల్లల్లాగే నేనూ చాలా అల్లరి చేసేవాడిని కోతికొమ్మచ్చి కొన్నాళ్ళు, గోలీలు కొన్నాళ్ళు, బడి ఎగకొట్టి చెరువులో యీతలాడ్డం కొన్నాళ్ళు. ఆ తర్వాత ఫుట్‌బాల్ ఆటలో పోటీలు, కెప్టెన్‌షిప్‌కోసం కొట్లాటలు వగైరా.

"ఆ తర్వాత టెన్నిస్‌మీద సరదా పుట్టి, కాలేజీ కూడా ఎగకొట్టి ప్రాక్టీస్ చేసేవాణ్ణి ! ''మధుబాబు నిట్టూరుస్తూ సునందవైపు చూసేడు. సునంద యివేమీ విన్పించుకున్నట్లు లేదు. రోజ్ గార్డెన్ వైపే చూస్తూంది. మధుబాబు అటువైపు దృష్టిని సారించేడు.

అక్కడ అయిదుగురు అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలు పచ్చికపైన కూర్చుని కిలకిల నవ్వుతూ, ఏవో జోక్స్ చెప్పుకుంటున్నారు. అందులో ఓ సుందరి తమవైపే పరిశీలనగా చూస్తూ మధ్య మధ్య తన స్నేహితురాళ్ళతో ఏదో తమ గురించే చెబుతున్నట్లుంది. అంతా అతనికి పరిచయస్థులే ! సునంద తన దృష్టిని మధుబాబు వైపు తిప్పి, 'మీరిక్కడకు తరుచుగా వస్తూంటారనుకుంటాను' అని అడిగింది.

''ఆ ! ఏమీ తోచకపోతే." అన్నాడు చాలా కేజువల్‌గా. సునంద అనుకుంది మధుబాబు కాలక్షేపానికి అక్కడవున్న ఆడపిల్లలతో అప్పుడప్పుడు యిక్కడికి వస్తూ వుంటాడన్నమాట. మధుబాబు వైపే చూస్తూన్న సుందరివైపు ఓసారి పరిశీలనగా చూస్తూ తను ఈర్ష్య చెందుతున్నట్లు తెల్సుకుంది ఈ సంగతి మధుబాబుతో చెప్పాలనుకుంది. ఇట్లాంటి విషయాలు మనస్సులో పెట్టుకోకూడదనుకుంది.

"చూడండి – యిప్పుడు నా మనస్సులో కొంచెం యీర్ష్య చెలరేగుతోంది.''

"ఈర్ష్యా ! ఎందుకు ?"

''వాళ్ళు మీకు పరిచయస్థుల్లా వున్నారు. అందులో ఎవరైనా మీతో చనువుగా వుండేవారా ?''

"వాళ్ళా : వాళ్ళంతా కాలేజీ అమ్మాయిలు ! సరదాగా వుంటారు ఎప్పుడూ ! ఏం ?''

''అబ్బే ... ఏంలేదు ... వూరికే అడిగేను." అంది సునంద, మరోవైపు చూస్తూ.

"సరదాగా ఎవరితోనైనా వుండొచ్చు. చూడండి ... అంటూ ఆమె భుజంపైన చెయ్యివేసేడు మధుబాబు. సునంద అతని చేతిని తోసి వెయ్యలేదు. ఆమె మొహం ఆనందంతో మెరిసింది. "నా వళ్ళు పులకరిస్తోంది. నా శరీరమంతా ఆనందంతో నిండిపోతోంది,'' అంది. "అయ్యో ... అయితే చెయ్యి తీసేస్తాను'' అంటూ వెంటనే చేతిని తీసేసి, ఎడంగా జరిగేడు మధుబాబు. "ఇక్కడ నా పైన మీకు అసహ్యం కల్గేట్లు లేదు. లేవండి. యింకో చోటకు పోదాం" అన్నాడు మధుబాబు లేచి నిలబడుతూ.

"అవును. నడవండి.'' అంటూ సునంద కూడా లేచి నిలబడింది.

ఇద్దరూ నడుచుకుంటూ దగ్గరలోనే వున్న చిన్న హోటలుకి వెళ్ళి 'టీ' తాగేరు. 'టీ' తాగుతూ ఆమె అడిగింది, "మీరెప్పుడైనా ఎవరినైనా ప్రేమించేరా ?"

మధుబాబు ఒక్కక్షణ నిరుత్తరుడై తేరుకుని సమాధానం చెప్పేడు. "ఆ... చాలా రోజులక్రితం. కాని అది ఒకవైపు ప్రేమే అవడంవల్ల, ఆమె చేతిలో నేను ఓడిపోవలసి వచ్చింది. తర్వాత తెలిసింది ఆమెకి కావలసింది డబ్బు కాని ప్రేమకాదని !"

"పాపం ! కాని ఆడవాళ్ళు అంతా అట్లాంటివాళ్ళే అనుకోకండి,'' అన్నది సునంద, సానుభూతిగా, మధుబాబువైపు చూస్తూ.

''కాకపోవచ్చు " అన్నాడు మధుబాబు ఆవులిస్తూ.

"ఇప్పటికైనా మీకు నాపైనవున్న సదభిప్రాయం పోయివుండొచ్చు. ఇంక లేద్దామా ?" అన్నాడు.

"ఇంకో చిన్న 'టెస్టు' మిగిలిపోయింది. బస్సులో ప్రయాణంచేస్తే మీ గుణగణాలు బాగా తెలుస్తాయి. బస్సెక్కుదాం రండి," అంది చిరునవ్వుతో.

ఇద్దరూ కలిసి బస్ స్టాప్ దగ్గరికి వచ్చేరు.

మధుబాబుకి బస్ ఎక్కడం చికాకు అవడంవల్ల మొహం అదోలా పెట్టేడు. సినిమా 'టైం' అవడంవల్ల బస్‌లన్నీ మహా రద్దీగా వున్నాయి. ఇద్దరూ తోసుకుంటూ ఒక బస్‌లో ఎక్కి, జనసమూహంలో మధ్యగా నిలబడి వున్నారు, 'హేంగర్స్' ని పట్టుకొని కాళ్ళు తొక్కేవాళ్ళు తొక్కుతున్నారు. డొక్కల్లో పొడుచుకుంటూ వెళ్ళేవాళ్ళు వెళ్తున్నారు. బస్ ఆకస్మికంగా ఆగినప్పుడు, వంకర్లు తిరిగినప్పుడు జనం ఒకరిపైన ఒకరు పడ్తున్నారు. మధుబాబుకి యిది భూలోక నరకంలా వుంది. సునంద యిదంతా 'ఎన్‌జాయ్' చేస్తున్నట్లు కిలకిలానవ్వుతూనే వుంది. అప్పుడప్పుడు, బస్ తిరిగే వంకర్లకి మధుబాబు మీదపడుతూ, తిరిగి సర్దుకుంటూ వుంది. మధుబాబు లోలోపల గొణుక్కుంటూనే వున్నాడు. ఎట్లాగైతేనేం 'బస్' రాణీగంజ్ వచ్చి చేరింది. అది రాణీగంజ్ బస్ అవడంవల్ల జనం అంతా ఉగిపోయేరు. సునంద బస్‌లోంచి దిగి, మధుబాబు భుజంపైన తలవుంచి, "మీకు చిరాకువస్తే - చూడ్డానికి భలే సర్దాగా వుంటుందండి," అంది.

"చచ్చేంరా దేవుడా ? మీ 'టెస్టు' యింతటితో అవలేదన్నమాట." అన్నాడు మధుబాబు !

సునంద ఏదో ఆలోచిస్తూ, "అది సరేగాని, నేను రెండు మూడు ప్రశ్నలు అడుగుతాను, సమాధానం చెప్పండి." అంది.

"అడగండి." అన్నాడు టాక్సీకోసం కళ్ళతో వెదుకుతూనే.

"మీ కుటుంబంలో బట్టతలవాళ్ళు వున్నారా ?"

"నాకు తెల్సినంతవరకు లేరు."

"పోనీ, మీ వాళ్ళలో ఎవరికైనా 'టి. బి.' గాని, కేన్సర్ గాని వచ్చిందా ?"

"వుహు. లేదు. కాని యిహముందు రాదని గ్యారంటీ ఏమీ లేదు"

సునంద నిట్టూర్చి, "అబ్బ ! నాకు మరేం ప్రశ్నలు తోచడంలేదు. మీరే చెప్పండి. ముఖ్యమైన విషయాలు" అంది.

"ఓ ! మేం లక్షాధికారులం కాదు," అన్నాడు.

"అదేం ముఖ్యమైన విషయంకాదు. మరేదైనా."

"నువ్వు చాలా అందంగా వున్నావు. ఇంక నీ అనుమానం తీరిందా ?" అన్నాడు మధుబాబు నవ్వుతూ, సునంద చేతిని తన చేతులోకి తీసుకుని వెచ్చగా నొక్కుతూ.

అవును. ఇది చాలా ముఖ్యమైన విషయమే. తను అతనికి నచ్చేనన్న మాట,' అనుకుంది సునంద. ఇంతలో ఖాళీటాక్సీనిచూసి, మధుబాబు సునంద చేతిని వదిలేసి, 'ఏయ్ టాక్సీ ! టాక్సీ' అంటూ కేకలువేస్తూ నాలుగడుగులు వేసేడు. టాక్సీ ఆగింది.

"ఊఁ ! నడవండి. మిమ్మల్ని మీ హోటలు దగ్గర దిగపెట్టేసి, నేను మా యింటికి వెళ్ళిపోతాను," అన్నాడు సునందతో.

"అప్పుడే హోటలుకా ? వద్దు.వద్దు" అంది సునంద.

"పోనీ మా యింటికి రండి. కబుర్లు చెప్పుకొని అక్కడే పడుకుందురుగాని. తెల్లారే మీరు మీ హోటలుకి వెళ్ళిపోదురుగాని ... ఎక్కండి ... మళ్ళీ టాక్సీలు దొరకవు, యీ సమయంలో."

సునంద టాక్సీలో ఎక్కి కూర్చుంది. మధుబాబు కూడా ఆమె ప్రక్కనే కూర్చుని, 'చిక్కడపల్లి' పోనివ్వమని టాక్సీ డ్రైవర్‌కి చెప్పేడు.

సునంద ప్రక్కనే కూర్చున్న మధుబాబు ఆమెను దగ్గరగా లాక్కుని 'ఇంత అందం, ఇంత అమాయకత్వం, ఒకచోటనే మూర్తీభవించడం ఎంత అదృష్టం' అంటూ ఆమె నడుంచుట్టూ చేతులువేసి, ఆమె మొహాన్ని ఒక్కక్షణంపాటు దగ్గరగా లాక్కుని, ఆమె కళ్ళల్లోకి చూసి, నిట్టూర్చి, ఆమెను వదిలేసేడు. ఆమె ఆశ్చర్యంగా అతనివైపుచూసి, కళ్ళుదించేసుకుని మధుబాబు అందరివంటివాడు కాడు...మంచివాడు అని నిర్ణయించుకుంది. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు తేలుతూ వుండగా చిక్కడపల్లి వచ్చేసింది. అందమైన ఒక చిన్న డాబాముందు టాక్సీని ఆపించేడు, మధుబాబు. ఆ యింటిముందు చిన్న అందమైన గార్డెన్ !

"ఇదేనా మీ యిల్లు ? చాలా బాగుంది. ఇంటికి తాళంవేసి వుందేం ?" అడిగింది సునంద కారులోంచే.

"మా అమ్మావాళ్ళూ వూళ్ళోలేరు. దిగండి - అట్లా చూస్తారేం ?" అన్నాడు మధుబాబు. సునందలోని ఆనంద వుత్సాహాలు అదృశ్యమయిపోయేయి ఆకస్మికంగా.

"మీ యింట్లో ఎవ్వరూ లేరని ముందే ఎందుకు చెప్పలేదు ?" అంది కొంచెం కటువుగా.

"హోటలుకి వెళ్ళడం యిష్టపడటం లేదు కదా అని మా యింటికి రమ్మన్నాను. పైగా మీ వంటి 'ఎడ్వాన్సుడ్ గరల్' నన్ను ఈ చిన్న విషయంలో అనుమానించడం-"

మధుబాబు చెప్పే మాటలు ఏవీ ఆమె చెవిలో చొరలేదు. మధుబాబు చుట్టూ ఆమె నిర్మించుకున్న అందమైన సౌధం పెద్ద శబ్దంతో కూలిపోయినట్లయ్యింది. ఎంత మంచి వాళ్ళనుకున్న మగవాళ్ళు కూడానా! – "క్షమించండి – నన్ను అపార్థం చేసుకున్నారు" అంటూ కోపంతో ధడాలున టాక్సీ తలుపు మూసేసి, ''ఏబిడ్స్‌కు పోనియ్యి.'' అంది గట్టిగా సునంద, టాక్సీ డ్రైవర్‌తో.

''సునందా! నా వుద్దేశం అది కాదు. నన్ను నువ్వు–" అంటూ మధుబాబు ఏదో చెప్పబోతున్నాడు. టాక్సీ కదిలి, శరవేగంతో అదృశ్యమయిపోయింది.

మరునాడు వుదయం మధుబాబు మైసూరు లాడ్జికి ఫోన్ చేసేడు. కాని సునంద అంతకుముందే 'రూం' ఖాళీ చేసేసి వెళ్ళిపోయిందని హోటల్ మేనేజర్ చెప్పగా, మధుబాబు విస్తుపోయేడు.

* * *

సునంద హైద్రాబాద్‌నుంచి తిరిగి వచ్చినప్పటినుంచీ మహా చికాకుపడిపోతోంది. ఆమెను ఎంతో గారాబంగా పెంచిన తలిదండ్రులు, విషాదంగా, మౌనంగా ఎవరి పనులు వాళ్ళు చేసుకుపోతున్నారు. సునంద అయితే గత నాలుగు రోజుల్నుంచి ఎవరితో మాట్లాడటంలేదు. ఇల్లు కూడా కదిలి బయటికి వెళ్ళడంలేదు. ఆ రోజు సాయంత్రం భగీరథరావుకి ఏ సంగతీ సమాధానం చెప్పాల్సిన ఆఖరిరోజు.

సునంద మధుబాబుని గురించి యీ నాలుగు రోజులూ మరచిపోదామనుకున్నా మరచిపోలేకుండా వుంది. ఆఖరికి మధుబాబు వద్దనుంచి, జరిగిన దానికి క్షమాపణ చెప్పుకుంటూ వుత్తరం వచ్చినా బాగుండేది, అదికూడా రాలేదు. అందుచేతనే, మధుబాబు కూడా అందరి వంటివాడే! ఈ మగాళ్ళంతా ఒకటే తీరు. వీళ్ళల్లో ప్రేమ అనేది మృగ్యం. మధుబాబు కూడా అంతే. తను వట్టి 'ఫూల్' లాగ అతనికోసం వెళ్ళి పరాభవించబడింది. ఛీ, అని ఆఖరిసారిగా అనుకుని, దుస్తులు వేసుకుని, భగీరథరావు నుంచి ఫోన్‌కాల్‌కోసం ఎదురుచూడసాగింది ... సోఫాలో కూర్చుని, ఫిలిమ్‌ఫేర్ చూస్తూ.

సునంద తల్లి కూడా కుమార్తెలో వస్తూన్న యీ మార్పుకి ఆనందించసాగింది. తన కుమార్తె కనక భగీరథరావుని చేసుకుంటే, తమ కోరిక నెరవేరుతుంది.

ఇంతలో టెలిఫోన్ మోగింది. "భగీరథరావు పిలుస్తున్నట్లున్నాడే తల్లీ" అంటూ తల్లి కేకవేసింది. "ఆ! సరేలే." అంటూ లేచి సునంద టెలిఫోన్ తీసుకుంది.

"ఎవరు? సునందేనా?" అన్నది అవతల స్వరం. స్వరాన్ని గుర్తుపట్టి ఒక్కక్షణం సునంద ఆశ్చర్యపోయింది. ఆ స్వరం భగీరథరావుది కాదు.

సునంద వుక్కిరి బిక్కిరి అయి, "ఆ – సునందే – ఎక్కడ్నుంచి?" అన్నది.

"హోటలు నవరంగ్ వుంది చూసేవు ... బొంబాయిలో! తొమ్మిదంతస్థుల లాడ్జింగ్ అండ్ రెస్టారెంట్! అందులోని 352 నంబర్ గదిలోంచి. నిన్ను చూద్దామని హైద్రాబాద్ నుంచి, యిక్కడికి వచ్చేను. హైద్రాబాద్ నుంచి యిక్కడికి 12 గంటల ప్రయాణం – మహా బోర్!" అన్నాడు.

సునందకి ఏం చెప్పాలో అర్థం కాలేదు. సంతోషంతో నోటమాట కూడా రాలేదు.

"సునందా?" ఆందోళనతో అడిగింది అవతలి స్వరం.

"యస్!" అంది సునంద.

"ఫోన్ డిస్‌కనెక్టు చెయ్యద్దు. ప్లీజ్."

"చెయ్యడం లేదు."

"చూడు! నిన్ను నేను అర్జంటుగా కల్సుకోవాలి. నా బాధ చెప్పుకోవాలి. నాల్గురోజుల్నుంచి నిన్ను మరచిపోదామని ప్రయత్నిస్తున్నా. కాని నా వశం కావడం లేదు. నాకీ చిన్న సాయంచేసిపెట్టాలి ... నీ మీద నాకు విరక్తి కల్గేందుకు 'హెల్ప్' చెయ్యాలి. ప్లీజ్!"

సునందకి అనుకోకుండా నవ్వువచ్చేసింది. విరగబడి నవ్వసాగింది.

"సునందా! నా అవస్థచూసి నవ్వుతున్నావా?

నేను కొంపతీసి నిన్ను ప్రేమిస్తున్నానా ఏమిటి?

అయితే నువ్వు తప్పక నన్ను 'డిస్‌యిల్యూషన్' చెయ్యాలి. ఏమంటావు?" అన్నాడు మధుబాబు అవతల నుంచి ఆదుర్దాగా.

ఆ సాయంత్రం యిద్దరూ బీచ్‌లో కూర్చుని, 'చెనా' తింటూ కబుర్లు చెప్పుకుంటూండగా, మధ్యలో సునంద అడిగింది. "ఎట్లా వుంది? కొద్దిగా అయినా నా పైన విరక్తి మొదలైందా?"

"వుహు." అంటూ జేబులోంచి ఓ కాగితం ముక్కతీసి, "తర్వాత చిన్న హోటలుకి వెళ్ళే బెస్టు" అన్నాడు.

"హోటలు బెస్టు నాకు ఉపయోగపడ్డం లేదు కదా – నీకు ఉపయోగిస్తుందంటావా?" అంది నవ్వుతూ సునంద.

"ఉహు! నీకు జరిగిన 'బెస్టు'లన్నీ నాకూ జరగాలసిందే.'' అంటూ కాగితాన్ని చింపేసి, సునందని దగ్గరగా లాగుకున్నాడు.

సునంద గువ్వలాగ అతని కౌగిలిలో ఒరిగిపోయింది, కువకువలాడుతూ.